క్లుప్తంగా

పట్టపగలే చోరీలు

కురిచేడు: పట్టపగలే చోరీలు జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెనుక వైపు నుసుం యల్లారెడ్డి ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. యల్లారెడ్డి ఇంట్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు బాదినేని హనుమంతరావు, నాగజ్యోతిలు అద్దెకు నివాసం ఉంటున్నారు. దంపతులు విధులకు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేనిది గమనించి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. బయట గేటు తాళం వేసింది వేసినట్లే ఉంది. లోపల గ్రిల్‌కు వేసిన తాళం తీసి ఉంది. లోపల తలుపు తాళం పగలగొట్టి తిరిగి వెళ్తూ కొత్త తాళం ఒకటి వేసి మరి వెళ్లిపోయారు. యథావిధిగా విధుల నుంచి ఇంటికి వచ్చిన హనుమంతరావు, నాగజ్యోతిలు బయట గేటు తీసుకుని గ్రిల్ వద్దకు వచ్చే సరికి తాళం వేసి లేకపోవడంతో అనుమానం వచ్చింది. గ్రిల్ గేటు తీసుకుని లోపలకు వెళ్లి తలుపు తాళం తీసే ప్రయత్నం చేయగా తాళం రాకపోవడంతో చోరీ జరిగినట్లు గ్రహించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం వచ్చి పరిశీలన అనంతరం ఏయే వస్తువులు పోయాయో వివరాలు వెల్లడించలేమని ఎస్సై శివ తెలిపారు.

ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



ఉల్లాస్ పుస్తకాలు ప్రదర్శిస్తున్న ఎంఈఓలు

త్రిపురాంతకం: మండలంలో ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమాన్ని వలంటరీ టీచర్లు విజయవంతం చేయాలని ఎంఈఓలు తులసిమల్లికార్జున్ నాయక్, టి.రాజశేఖరరెడ్డి అన్నారు. మండల కేంద్రం త్రిపురాంతకం వెలుగు కార్యాలయంలో రెండో విడత ఉల్లాస్ అక్షరాస్యతపై సోమవారం అవగాహన కల్పించారు. ఎంఈఓలు మాట్లాడుతూ సమాజానికి మేలు కలిగే విద్యా కార్యక్రమాన్ని ప్రతి వలంటరీ టీచర్ తన విధిగా భావించి 10 మందికి చదువు నేర్పించాలన్నారు. ఎంపీపీ రిబ్కా, ఏపీడీ కృష్ణ, ఏసీ శ్రీదానం, ఏపీఎం ఎడ్వార్, సీసీలు ఆంజనేయులు, జ్యోతి, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, వలంటరీ టీచర్లు పాల్గొన్నారు.



కొండపై నిర్మించిన ఆలయం



పూజలందుకుంటున్న వీర నరసింహస్వామి

మొక్కారంటే కోరిక తీరినట్లే

- కోర్కెలు తీర్చే వీర నరసింహస్వామి
- కొండపై శరవేగంగా ఆలయ అభివృద్ధి
- ఇప్పటికే రోడ్డు నిర్మాణం పూర్తి
- నాగంబొట్లపాలెం వాసుల కృషి

దర్శి: అక్కడ మొక్కుకున్నారంటే కోర్కెలు తీరినట్లే.. కొండపై వీర నరసింహస్వామి ఆలయం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. వందలాది సంవత్సరాల క్రితం తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెం పరిధిలోని కొండపై వెలసిన వీర నరసింహస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. స్వామి వారు రాయిపై వెలిశారు. గతంలో ఆలయం గుహలా ఉండేది. లోపలకు వెళ్లి రావాలంటే ఒక్కొక్కరు మాత్రమే వెళ్లి స్వామిని దర్శించుకుని బయటకు వచ్చిన తర్వాత మరొకరు వెళ్లి దర్శించుకునే వారు. ఇలా గుహలో కొండ రాయిలో వెలసిన వీర నరసింహస్వామికి వందలాది సంవత్సరాల నుంచి భక్తులు పూజలు చేస్తున్నారు. కాల క్రమేణ ఆలయాన్ని అభివృద్ధి చేస్తూ ప్రస్తుతం ఎంత మందైనా వెళ్లి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. కొండపైకి వాహనాలు వెళ్లేలా రోడ్డు వేశారు. కొండపైన ఎంత మంది భక్తులు వచ్చినా ఇబ్బందులు లేకుండా పైప్రాంతాన్ని చదును చేశారు. ఎక్స్‌ప్రెస్ హైవే కాంట్రాక్టర్ సహకారంతో కొండపైకి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఏటా సంక్రాంతికి వైభవంగా తిరునాళ్ల నిర్వహించి విద్యుత్ ప్రభలు కూడా ఏర్పాటు చేస్తుంటారు. ప్రతి శనివారం మాత్రమే తెరిచే ఆలయానికి భక్తులు తండోప తండాలుగా వస్తుంటారు. ఆలయంలో పొంగళ్లు నివేదన చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటుంటారు. ఇక్కడ మొక్కుకున్న వాళ్లందరినీ వీరనరసింహస్వామి మొక్కులు తీర్చుతారని భక్తుల విశ్వాసం. అందుకే ఈ ప్రాంతంలో ఉండి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాల్లో స్థిరపడ్డ వారు. అక్కడి స్థానికులు స్వామి మహిమల గురించి తెలుసుకుని వచ్చి మొక్కులు మొక్కుకుని వెళ్తుంటారు. స్వయంభుగా వెలసిన వీర నరసింహస్వామి ఆలయం ఉన్న కొండను ఆనుకుని బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. చుట్టూ ఉన్న కొండలు ప్రకృతి అందాలు అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. కొండ ఆనుకుని మెళికలు తిరుగుతూ సాగర్ కెనాల్ పరవళ్లు తొక్కుతోంది. ఈ కాలువ ద్వారా చుట్టుపక్కల రైతుల పంటలు పండుతాయి. మేరు పర్వతంలా ఆలయం చుట్టూ కొండలు మధ్యలో వేలాది ఎకరాల పండ్ల తోటలు ఉన్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో కొండపై స్వామి ఆలయానికి వెళ్లిన వారు ఆ ప్రకృతి సౌందర్యాన్ని చూసి అక్కడే ఉండి పోవాలనిపించేలా ఉంటుంది. సంక్రాంతి పండగకు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి తిరునాళ్ల సందర్భంగా వచ్చి స్వామి వారి దర్శనం చేసుకుని వెళ్తుంటారు. తిరునాళ్లకు భారీగా విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తోంది.



కొండపై వెలసిన వీరనరసింహ స్వామి ఆలయం



కొండను ఆనుకుని వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ హైవే



ఆలయంపై ఏర్పాటు చేస్తున్న మెట్లు

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు

ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ



పెద్దదోర్నాలలో ఇబ్రహీంను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పెద్దదోర్నాల: బ్రెయిన్ ట్యూమర్‌తో శస్త్ర చికిత్స చేయించుకుని కోలుకుంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇబ్రహీంను యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ సోమవారం పరామర్శించారు. మండల కేంద్రంలోని ఇబ్రహీం గృహానికి చేరుకున్న ఎమ్మెల్యే ఆయనతో మాట్లాడారు. ఇబ్రహీం ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ఇబ్రహీంను పరామర్శించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, రాంభూపాల్‌రెడ్డి, పవన్‌కుమార్, దూదేకుల రసూల్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని బొగ్గరపు సత్యమమ్మ కళ్యాణ మండపంలో జరిగిన సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ షెక్షావలి వివాహ వేడుకలకు హాజరయ్యారు.

కోటేశ్వరరావుకు నివాళి

పెద్దారవీడు: మండలంలోని సానికవరం వైఎస్సార్ సీపీ నాయకుడు కోటేశ్వరరావు ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సోమవారం కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచ్ ఎంపీ రమణారెడ్డి, నాయకులు మూల సత్యంరెడ్డి, పోటు గంగయ్య, పల్లపు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పశువులు, జీవాలపై జాగ్రత్తలు తీసుకోవాలి



పెద్దారవీడు: పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ బాలునాయక్

పెద్దారవీడు: పశువులు, జీవాల పెంపకంలో తగు జాగ్రత్తలు పాడి రైతులు, కాపర్లు తీసుకోవాలని పశు వైద్యశాల డాక్టర్ బాలునాయక్ అన్నారు. మండలంలో సుంకేసులలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పశువులకు సకాలంలో టీకాలు వేయించాలని, గొర్రెలు, మేకలు బొబ్బ టీకాలు వేయించుకోవాలని తెలిపారు. పెయ్య దూడలను పుట్టించే వీర్యం పెద్దారవీడు పశు వైద్యశాలలో అందుబాటులో ఉందని, దాన్ని గేదెలకు ఉపయోగించుకోవాలని చెప్పారు. పశువులు, జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం గొర్రెలు, మేకలు, గేదెలు, లేగ దూడలకు వైద్య పరీక్షల అనంతరం నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ గుడ్డెపోగు రమేష్, మాజీ సర్పంచ్ అనుముల ప్రసాద్, పశువైద్య సిబ్బంది షేక్ ఇస్మాయిల్, పి.కిరణ్, అమీర్‌బాషా, అల్లాభక్షి, వీరంజినాయక్, తులసీరామ్‌నాయక్, రాజారావు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్

- ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

దర్శి: నూతన విద్యా విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా 46వ మహాసభ సందర్భంగా విద్యార్థులతో పట్టణంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు కంకణాల ఆంజనేయులు అధ్యక్షతన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో ప్రసన్నకుమార్ మాట్లాడుతూ వెనుక బడిన ప్రకాశం జిల్లాకు ప్రకటించిన యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ, మార్కాపురం మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసి త్వరితగతిన ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన తల్లికి వందనం పథకం వచ్చే ఏడాదికి వాయిదా వేయడం బాధాకరమన్నారు. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పలు దఫాలుగా లేఖలు రాసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు మాత్రం ఆ ఊసే ఎత్తక పోవడం దుర్మార్గంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణ, ప్రైవేటీకరణ వంటి విధానాలే రాష్ట్రంలో కూడా అమలు చేస్తున్నారని చెప్పారు. ఏటా 1.5 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలను విడిచి పెడుతున్నారని అంచనా ఉందని, ఇప్పటికీ రాష్ట్రంలో 50 శాతం విద్య ప్రైవేటీకరణ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను పాడెకట్టడానికి ప్రముఖ విద్యా వ్యాపారవేత్త నారాయణను మంత్రిగా పెట్టుకున్నారని చెప్పారు. ఇంగ్లిష్ మీడియం పోటీ పరీక్షల పేరుతో విద్యను వ్యాపారమయం చేశారన్నారు. ఉపాధ్యాయుడు, విద్య, చదువు అన్నీ వ్యాపార వస్తువులగా మారాయని చెప్పారు. విద్యార్థుల ఆత్మహత్యలు సైతం ఆ విద్యాసంస్థల్లో కనిపిస్తున్నాయని చెప్పారు. జీఓ నంబర్-77 రద్దు చేసి పీజీ చదివే విద్యార్థులందరికీ అధికారంలోకి వచ్చిన వెంటనే రియింబర్స్‌మెంట్ కల్పిస్తామని చెప్పి విద్యార్థులకు తీరని అన్యాయం చేశారన్నారు. సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో మూసి వేసేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. హాస్టళ్లు మూసి వేస్తే జిల్లా పరిషత్ స్కూళ్లు వెలవెలబోతాయని టీచర్లు, భవనాలు మాత్రమే మిగులుతాయన్నారు. పొమ్మన లేక పొగ పెట్టినట్లు హాస్టళ్లను సమస్యల సుడిగుండంలో నెట్టారన్నారు. అకస్మాత్తుగా వచ్చే పేపరు బిల్లులు రాక వార్డెన్‌లు అప్పుల ఊబిలో ఉన్నారన్నారు. మెస్ చార్జీలకు పొంతన లేకుండా ఉందని చెప్పారు. ఒక వార్డెన్ మూడు హాస్టళ్ల బాధ్యత చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. అద్దె భవనాలు, చాలీచాలని ఇరుకు గదుల్లో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవుట్ సోర్సింగ్ వర్కర్‌లతో హాస్టళ్లు నడపాల్సి ఉండగా వేలాది మంది సిబ్బంది చాలీచాలని జీతాలతో బతకలేక పక్కకి తప్పుకుంటున్నారని పేర్కొన్నారు. వారి సమస్యలు పరిష్కారం చేయకపోగా వారి స్థానాల్లో కొత్తవారిని తీసుకోకపోవడంతో వార్డెన్‌లపై వంట బాధ్యత పడుతుందని చెప్పారు. ఈ సమస్యలపై రాబోవు రోజుల్లో పోరాటాలు చేసేందుకు మహాసభ కేంద్రం కావాలని ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయ్, నాయకులు సోమయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజు, సాయి, పాండురంగారావు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పుల్లలచెరువు: మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వసంతరావు నాయక్ తెలిపారు. ఎంపీపీ వెంకటయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. మండలస్థాయి అధికారులు తగిన సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో వసంతరావునాయక్ కోరారు.

కారు..బైక్ ఢీ

కురిచేడు: కారు.. బైక్ ఢీకొని ఒకరికి గాయాలైన విషయమై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివ తెలిపారు. వివరాలు.. వారం రోజుల క్రితం స్థానిక దర్శి రోడ్డులోని పశువైద్యశాల వద్ద ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న పందుగుల వెంకటేశ్వరరెడ్డికి గయాలయ్యాయి. వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని నారాయణ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివ తెలిపారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

IA 961/2009 OS 73/1982

ఆరే లక్ష్మయ్య మరియు వగైరాలు ..... Petitioners

Vs

ఆరే సుబ్బమ్మ మరియు వగైరాలు ..... Respondents

పై నెంబర్ పిటీషన్‌లో ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని భాగం పంచుటకు అవకాశము లేనందున ఘనమైన కోర్టు వారు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని కోర్టులో వేలం వేయుట ద్వారా వచ్చిన ఫైకమును పిటీషనర్లులకు రావలసిన వాటా పోగా మిగత ఫైకమును మిగతా రెస్పాండెంట్లుకు కోర్టు తీర్పు ప్రకారము పంచటం జరుగును. అందుకుగాను కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ క్రింది షెడ్యూల్ దాఖల ఆస్తిని **13.2.2025**వ తేదీన ఉదయం **10.30** గం॥లకు బహిరంగ వేలం వేయుటకు కోర్టు వారు నిర్ణయించటమైనది. బహిరంగ వేలములో పాల్గొన దలచిన వారు వేలంలో పాల్గొన వచ్చును.

ఐటమ్ నెం.7 పిటిషన్ షెడ్యూల్ : మార్కాపురం మునిసిపాలిటీ, మార్కాపురం టౌన్ 1st ward, House bearing Door No: 1/167. **తూర్పు:** టీమలమర్రి వెంకటరెడ్డి ఇల్లు మరియు రస్తా. **దక్షిణం:** బజారు, **పడమర:** శ్రీరామ్ మాధవయ్య ఇల్లు, **ఉత్తరం:** మూడుసనాల సుబ్బన్న. **తూర్పు-పడమర:** 5 Yards i.e 4.57 metres, **ఉత్తరం-దక్షిణం:** 25 Yards i.e 22.86 metres site and the terraced building

మార్కెట్ విలువ : **Rs.25,000/-** వేలం తేది: **13.02.2025**

ప్రస్తుత సబ్‌రిజిస్ట్రార్ విలువ : **Rs.38,50,000/-**

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

ఆకుల ఉపశ్రీ, for Petitioners అడ్వకేట్, మార్కాపురం.

బోయలపల్లిలో పశువైద్య శిబిరం



పుల్లలచెరువు: పశువులకు నట్టల నివారణ మందు తాగిస్తున్న వైద్యాధికారి

యర్రగొండపాలెం: మండలంలోని బోయలపల్లిలో సోమవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి 1548 జీవాలకు, 29 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. పశు సంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు పశువులకు కృత్రిమ గర్భధారణ, 4 పశువులకు గర్భకోశ వ్యాధులు, 24 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్స చేశామని పశు వైద్యాధికారి డి.మంత్రూనాయక్ తెలిపారు. బ్రూ సెల్లోసిస్ వ్యాధి నిర్ధారణ కోసం 10 విత్తనపు పొట్టేళ్ల, మేకపోతుల నుంచి రక్త నమూనాలు సేకరించామని తెలిపారు. ఆ పంచాయతీ సర్పంచ్ పాలడుగు వెంకటేశ్వర్లు, పాడి, జీవాల పెంపకదారులు, పశు సంవర్ధక సహాయకులు జిలానీ, మౌనిక, వరలక్ష్మి, శిరీష, తిరుమల్ పాల్గొన్నారు.



గొర్రెకు నట్టల నివారణ మందు తాగిస్తున్న పశువైద్యులు

పుల్లలచెరువు: మండలంలోని ఐటీ వరంలో సోమవారం పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ నాగులమీరా తెలిపారు. శిబిరంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేసినట్లు తెలిపారు. లేగ దూడులకు నులిపురుగుల మందును తాగించారు. అనారోగ్యంతో ఉన్న పశువులను పరీక్షించి తగిన మందులు ఇచ్చినట్లు తెలిపారు. గర్భకోశ పరీక్షలు, చూడి పరీక్షలు నిర్వహించి అవసరమైన వాటికి మందులు ఇచ్చినట్లు తెలిపారు. పశుపోషకులు గ్రామాల్లో జరిగే పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంటీటీసీ సభ్యుడు గోవింద్, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓతో సచివాలయ సిబ్బంది భేటీ

తాళ్లూరు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుందర్ రామయ్య సెలవుపై వెళ్లడంతో నూతనంగా ఎంపీడీవోగా దారా హనుమంతరావును నియమించారు. ఆయన బాధ్యతలు స్వీకరించడంతో సచివాలయం సిబ్బంది సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు నర్సారెడ్డి, రాజా, శ్రీను, వెంకటరావు, ఆదాం, రవీంద్ర పాల్గొన్నారు.



ఎంపీడీవోను సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

వీధి కుక్కల స్వైరవిహారం



నడి రోడ్డుపై గుంపుగా ఉన్న కుక్కలు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో కుక్కల బెడద ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఊరి చివర ఉండే జంతు వ్యర్థాలను తిని రోడ్ల మీదకు వచ్చి నిద్రిస్తూ తరుచూ వాహనదారులు వెంట పడి గాయపరుస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, మహిళలు తమ పనుల రీత్యా బయటకు వెళ్లాలంటే ఎక్కడ కరుస్తాయో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.